క్లుప్తంగా...

కార్పొరేటర్ పర్యటన



టీఆర్‌టీ క్వార్టర్స్ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్, వీరయ్య వీధి ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉంటున్న వృక్షాలను తొలగిస్తామని కార్పొరేటర్ సామల హేమ హామీ ఇచ్చారు. వృక్షాలు నిరుపయోగంగా మారడం, వాటి చుట్టూ వ్యర్థాల కుప్పలు పోగవుతుండడంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆమె జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ అధికారి సురేశ్, జలమండలి మేనేజర్ అన్విత్‌తో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా హేమ మాట్లాడుతూ.. టీఆర్‌టీ, వీరయ్య వీధి ప్రాంతాల్లో ఆరోగ్యకర వాతావరణాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

మంత్రిని కలిసిన భారత్ స్కౌట్స్ అధికారులు



వినతి పత్రం అందిస్తున్న దృశ్యం


రాంగోపాల్‌పేట్: ప్యారడైజ్ ప్రాంతంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్థలాన్ని సికింద్రాబాద్ అగ్నిమాపక శాఖ అధికారులు కబ్జా చేశారంటూ స్కౌట్స్ అధికారులు సోమవారం మంత్రి తలసానికి కలిసి విన్నవించారు. 1930 నుంచి ఇక్కడ భారత్ స్కౌట్స్ కొనసాగుతుండగా ఆ తర్వాత ఫైర్‌స్టేషన్ తమ కార్యాలయం ముందు ఏర్పాటు చేశారని చెప్పారు. కొద్ది రోజులకు పక్కన మరో భవనాన్ని నిర్మించారని, రెండు భవనాల మధ్య మొదటి నుంచి తమ ఔట్ గేట్ కొనసాగుతుందని వివరించారు. అయితే శనివారం డీఎఫ్‌వో, ఎస్‌ఎఫ్‌వో సిబ్బంది వచ్చి ఔట్‌గేట్‌ను కూల్చివేసి రోడ్డును మూసివేస్తూ గోడ నిర్మించారని మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు స్కౌట్స్ అధికారులు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి రమేష్ చందర్, సహాయ జిల్లా కమిషనర్ డాక్టర్ ఎంహెచ్ బతేనా, జిల్లా కార్య నిర్వాహక కమిషనర్ ఎస్ విజయ భాస్కర్, స్కౌట్ మాస్టర్లు విష్ణు ప్రసాద్, వనం రాజు ఉన్నారు.

'జన్ ఆరోగ్య సమితి' కమిటీ ఏర్పాటు



అడ్డగుట్ట: అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సాయి శంకర్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'జన్ ఆరోగ్య సమితి' కమిటీని ఏర్పాటు చేశారు. ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం, ఆరోగ్య కేంద్రం అభివృద్ధి ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్‌పీహెచ్‌ఓ రాజశ్రీ తెలిపారు. ఇది వరకు హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించేవారని, ప్రస్తుతం ఆ సొసైటీని తొలగించి, దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జన్ ఆరోగ్య సమితి' పేరుతో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ చైర్ పర్సన్‌గా కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, కో–చైర్ పర్సన్‌గా ఎస్‌పీహెచ్‌ఓ రాజశ్రీ, సెక్రటరీ డాక్టర్ సాయి శంకర్, అఫీషియో అండ్ మెంబర్స్‌గా డాక్టర్ శిరీష, అంగన్వాడీ సూపర్‌వైజర్ సంధ్య, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి, జీహెచ్‌ఎంసీ ఏఈ వేణు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో పాటు పలువురు స్థానికులను ఈ కమిటీలో నియమించినట్లు తెలిపారు.

మయూరం .. వయ్యారం



ఓయూ క్యాంపస్‌లో వయ్యారాలతో మయూరాలు సందడి చేస్తున్నాయి. వేసవి తాపాన్ని తట్టుకోలేక దాహార్తి తీర్చుకునేందుకు బయటకు వస్తుంటాయి. సోమవారం ఓ మయూరం పురివిప్పి ఆడుతూ కనువిందు చేస్తున్న దృశ్యాన్ని 'సాక్షి'క్లిక్ మనిపించింది.

–ఉస్మానియా యూనివర్సిటీ

అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



అధికారులతో చర్చిస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను సికింద్రాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా వైభవోపేతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తం కావాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆదేశించారు. జూన్ 2 నుంచి రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. 2014 జూన్ 2 నుంచి నేటి వరకు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు మరోమారు తెలియజెప్పేలా కార్యక్రమాలు రూపొందించాలని కోరారు. 50 సంవత్సరాలుగా నియోజకవర్గంలో జరగని అభివృద్ధి పనులు రాష్ట్ర అవతరణ అనంతరం పూర్తి చేశామన్నారు. రాష్ట్ర అవతరణకు ముందు, తరువాత అభివృద్ధి నివేదికలను కరపత్రాలు, ఫ్లెక్సీల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అన్ని డివిజన్లలో వేదికలు ఏర్పాటు చేసి ప్రగతి సదస్సులు నిర్వహించాలని, అందులో ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. అదేవిధంగా రోజుకు ఒక కార్యక్రమం చొప్పున ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లా, రాష్ట్ర స్థాయి కార్యక్రమాల్లో సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలను భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆశాలత, టౌన్‌ప్లానింగ్ అధికారి ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. సికింద్రాబాద్ మండల పరిధిలోని 29 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం ఆయన వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం పేదింటి ఆడపడుచు పెళ్లికి రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు ఆసరా పథకం ద్వారా పింఛన్లు అందజేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో బన్సీలాల్‌పేట కార్పొరేటర్ హేమలత, సికింద్రాబాద్ తహసీల్దార్ శైలజ, బీఆర్‌ఎస్ బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ రాజు పాల్గొన్నారు.

అర్హులకే ఇళ్లు కేటాయించాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న అవినాష్ జాదవ్

రసూల్‌పురా: సిల్వర్‌కంపెనీ వద్ద నిర్మించిన డబుల్ ఇళ్ల కేటాయింపులో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించకుండా టీఆర్‌ఎస్ నాయకులు లక్షలాది రూపాయలకు అమ్ముకున్నారని బీఎస్‌పీ కంటోన్మెంట్ అసెంబ్లీ ఇన్‌చార్జి అవినాష్ జాదవ్ ఆరోపించారు. సోమవారం సికింద్రాబాద్ ఆర్డీవో, తహసీల్దార్ శైలజలను కలిసి అర్హులను గుర్తించి వారికే కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 168 ఇళ్లను నిర్మించగా 161 మంది లబ్ధిదారులకు మాత్రమే కేటాయించారని మిగిలిన ఏడు ఇళ్లను ఇతరులకు అమ్ముకున్నారని అన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న మరో 40 ఇళ్లకు గాను మొదటి విడతలో లబ్ధిపొందిన వారి కుటుంబ సభ్యులకు అందజేసేందుకు జాబితా రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో నాగేందర్, యూసుఫ్, వెంకట్, శ్రీను, శేఖర్, ఖలీల్, శ్రీలత, ఫర్జానా, రెహమాన్‌పున్నారు.

పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సహకరించాలి



వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన దశరథ్

సికింద్రాబాద్: కొత్త పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సికింద్రాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి దశరథ్ కోరారు. సోమవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా ఉండే తీరులో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాతస్టేషన్ల తొలగింపు, కొత్త స్టేషన్ల ఏర్పాటులో సలహాలు సూచనలు అందించాలన్నారు. అదే విధంగా ఓటర్ల నమోదు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ఓటర్ల పేర్లన్నీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అదే విధంగా నిర్దేశిత తేదీల్లో కొత్తగా ఓటర్ల నమోదు, సవరణల అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయక ఎన్నికల అధికారి హేమలత, ఎన్నికల విభాగం ఇన్‌చార్జి కే.భుజేందర్ బాబు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాజసుందర్, ప్రకాశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే సంక్షేమ పథకాల అమలు




మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

రసూల్‌పురా: సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తుందని ఆ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోర్డు మాజీ సభ్యుడు బి. ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మడ్‌ఫోర్ట్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో పన్నెండు వందలకు పైగా డబుల్ బెడ్రూమ్‌లు కట్టించామని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఆడపిల్లల వివాహానికి ఆర్థిక సాయం, అర్హులకు పింఛన్లు అందజేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం వల్ల పేదలకు ఒరిగిందేమీ లేదని అయినా ఆ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మోదీని దేవుడని అంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడంతో కేసీఆర్‌ను దేవుడిలా కొలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ క్రిశాంక్, రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీగణేష్, ముప్పిడి మధుకర్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, అనితా ప్రభాకర్, శ్యామ్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో మర్రి..

రసూల్‌పురా: తిరుమలగిరి లాల్‌బజార్ శ్రీ మహంకాళి దేవస్థానంలో సోమవారం బోర్డు మాజీ సభ్యులు శ్యాంకుమార్– భాగ్యశ్రీ దంపతుల ఆధ్వర్యంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యార్చన, నిత్య హోమం, మండప పూజలు, ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ తదితర పూజాది కార్యక్రమాలు జరిగాయి. బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పి. గౌరిశంకర్, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు బి. ప్రభాకర్, నళినికిరణ్ పూజలో పాల్గొన్నారు. రెండు వందల ఏళ్ల చరిత్ర గల ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కనుల పండువగా జరిగిందని ఈ సందర్భంగా రాజశేఖర్‌రెరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజుసింగ్, పెద్దాల నరసింహ, ఆలయ పూజారి రవి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: చిరు వ్యాపారులపై ట్రాఫిక్ పోలీసులు వేధింపులు ఆపాలని బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి కోరారు. బెల్సన్ తాజ్ హోటల్ ఎదురుగా మోటార్ వాహనాల మరమ్మతులు, పెయింటింగ్ తదితర పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న వారిని స్థానిక ట్రాఫిక్ పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని మర్రి శశిధర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. సోమవారం ఆయన ఆ ప్రాంతాన్ని సందర్శించి ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డేతో మాట్లాడారు. గత 50 ఏళ్ల క్రితం ఓల్డ్ జైల్ ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయనే ఉద్దేశంతో ఇక్కడికి తరలించారన్నారు. 1992లో రాష్ట్ర హైకోర్టు కూడా వీరికి ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతే తరలించాలని సూచించిందని కానీ ఇప్పుడు ట్రాఫిక్ పోలీసులు ఇష్టం వచ్చినట్లు వారిని వేధింపులకు గురిచేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో హరి, సంజీవరెడ్డి, రవి, విష్ణు, నర్సింగ్‌రావు, దయానంద్, వెంకట్రాజ్ పాల్గొన్నారు.

మురుగులోనే అడుగులు



రోడ్లపై మురుగు నీరు ఏరులై పారుతుండటంతో అటుగా రాకపోకలు సాగించే క్రమంలో దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. రెజిమెంటల్‌బజార్‌లోని సలూజ నర్సింగ్ హోం వెనుక వైపు గత వారం రోజుల నుంచి మురుగు నీరు పారుతున్నా పట్టించుకునే నాథులే లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –రాంగోపాల్‌పేట్

బయో ఎనర్జీ ప్లాంట్ పరిశీలన



రసూల్‌పురా: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్యవసాయ మార్కెట్‌లో కూరగాయల వ్యర్థాలతో నిర్వహిస్తున్న బయో ఎనర్జీ ప్లాంట్‌ను సోమవారం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ శ్రీరంగారావు, ఎండీ మనోహర్‌రాజు, ఫైనాన్స్ మెంబర్ బండారు కృష్ణయ్య సందర్శించి నిర్వహణ విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

శానిటరీ ప్యాడ్స్ వెండింగ్ మెషిన్ వితరణ



మెషిన్ అందజేస్తున్న ప్రతినిధులు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి గైనకాలజీ విభాగానికి యంగ్ లేడీస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శానిటరీ ప్యాడ్స్ వెండింగ్ మెషిన్‌ను వితరణ చేశారు. గాంధీ ఆస్పత్రిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో యంగ్ లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ ఛాప్టర్ చైర్ పర్సన్ ఆర్తీషా, హెడ్ స్మితగోడ మాట్లాడుతూ.. ప్రపంచ రుతుచక్ర పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పిరియడ్స్ సమయంలో అనేక రకాల సమస్యలు, ఇబ్బందులు పడుతున్న యువతులు, మహిళలకు సహజసిద్ధంగా వచ్చే రుతుచక్రంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేసి పలు అంశాలపై చైతన్య పరుస్తున్నామన్నారు. నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న గాంధీ పాలన యంత్రాంగం, వైద్యులను అభినందించి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీలు సంగీత షా, వినయ్‌శేఖర్ ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, యంగ్ లేడీస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఆర్తీషా, స్మిత, పల్లవికృష్ణ, రాధీజైన్, మధులికఅప్పసాని పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



లాలాపేట: కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ వివరాల ప్రకారం.. చిలకలగూడ ప్రాంతానికి చెందిన సెకిలోహి(33) లాలాపేటలోని న్యూఫ్రెండ్ కేఫ్‌లో పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం పని కోసం వెళ్తుండగా తార్నాక చౌరస్తాలోని లాలాపేటకు వెళ్లే బస్టాప్ వద్ద వేగంగా వచ్చిన గుర్తు తెలియని ఓ కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయాడు. రక్తపు మడుగులో పడిఉన్నా అతన్ని జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది గమనించి 108 అంబులెన్స్‌ను సమాచారం ఇవ్వగా వారొచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు అంబులెన్స్ సిబ్బంది నిర్ధారించారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సికింద్రాబాద్: బంగారు తెలంగాణ పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టే ప్రకటనలు చేయడం తప్ప పేదలకు న్యాయం జరిగే విధంగా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలమైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ విమర్శించారు. బౌద్ధనగర్‌లో సోమవారం కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన బస్తీ పోరు సభకు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలన విధానాల ఫలితంగా ధరలు భారంగా మారి పేదలు జీవించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో మాత్రమే గరీబీ హటావో నినాదంతో పేదలకు సంపూర్ణ న్యాయం జరిగిందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు 10 వేల డబుల్ బెడ్రూమ్‌లు ఇస్తామన్న స్థానిక శాసనసభ్యులు కనీసం ఐదు వందల ఇళ్లు కూడా నిర్మించలేకపోయారని ఆరోపించారు. బౌద్ధనగర్ డివిజన్‌కు తానే మెంటర్‌నని ప్రకటించుకుని ఈ ప్రాంతంలో పర్యటనలు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పట్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలంతా ఓట్లు వేసి మళ్లీ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సృజన్‌కుమార్, అనిల్‌కుమార్, జయరాజ్, చక్రధర్, హరి, మహేష్ ,మహేందర్, షబానాబేగం, గులాం, ముగ్దుం పాల్గొన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణతో బడుగుల్లో ఆనందం



దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న గజ్జెల నాగేష్

రసూల్‌పురా: బడుగు బలహీన వర్గాల జీవితాల్లో ఆనందం నింపాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించి జీఓ 58, 59 ద్వారా ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ చేస్తున్నారని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు మహ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌లో జీవో 58, 59పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విధానాలను గజ్జెల నాగేష్ వివరించారు. తగిన ఆధారాల జిరాక్స్ ప్రతులతో మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుని పట్టాలు అందజేస్తుందన్నారు. అనంతరం ఇళ్ల క్రమబద్ధీకరణ దరఖాస్తు ఫారాలను అందజేశారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

అడ్డగుట్ట: దశలవారీగా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. సోమవారం జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి డీ –సెక్షన్‌లో ఆమె పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. అతి త్వరలో బస్తీలో సీవరేజీ పైప్‌లైన్, మెట్లదారి పనులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. కార్పొరేటర్ వెంట గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ ఏఈ వేణు, జలమండలి ఏఈ స్రవంతి, నేతలు వడ్లూరి రవి, ఇస్మాయిల్, గోపి పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రసన్న

బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవానికి తరలిరావాలి



రఘుకిరణా చార్యులు

అడ్డగుట్ట: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా గోపాన్‌పల్లిలో జరుగనున్న బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవానికి వేలాది మంది బ్రాహ్మణులు తరలిరావాలని బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షులు రఘుకిరణాచార్యులు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడా లేని విధంగా బ్రాహ్మణుల సంక్షేమం కోసం మొదటిసారిగా బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేసి, దాని ద్వారా బ్రాహ్మణులందరికి కూడా విద్య, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కల్పించడంతో పాటు బ్రాహ్మణ భవన్ నిర్మించడం సీఎం కేసీఆర్‌కే సాధ్యమైందన్నారు. అంతే కాక బ్రాహ్మణ పరిషత్ వివేకానంద ఓవర్ స్కీమ్స్ ద్వారా బ్రాహ్మణ విద్యార్థులకు విదేశాల్లో చదవడం కోసం 780 మందికి రూ.76.67 కోట్లు మంజూరు చేయించడం హర్షణీయం అన్నారు. వివిధ జిల్లాల్లో కూడా బ్రాహ్మణ భవన్ నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని, బ్రాహ్మణ సంక్షేమ పథకాలను అందజేయడంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ రమణాచారి కృషి ఎంతగానో ఉందన్నారు.

రసూల్‌పురా: రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కట్టుబడి ఉన్నారని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సన్నిదానం మహేశ్ శర్మ అన్నారు. సోమవారం బోయిన్‌పల్లి ముత్యాలమ్మ ఆలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 31న (రేపు) గోపన్‌పల్లిలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బ్రాహ్మణ భవనం ప్రారంభం అవుతుందని ఈ కార్యక్రమానికి వేలాది మంది బ్రాహ్మణులు తరలి వస్తున్నారన్నారు. గతంలో సీఎం కేసీఆర్ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీ ప్రకారం గోపన్‌పల్లిలో ఆరు ఎకరాల స్థలంలో 12 కోట్ల రూపాయల వ్యయంతో బ్రాహ్మణ భవనం నిర్మించారన్నారు. ప్రారంభోత్సవానికి మంత్రులు ఇంద్రాకరణ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేవీ. రమణాచారి హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో వేదిక ఉపాధ్యక్షులు మధుసూదన్ శర్మ, రాష్ట్ర కార్యదర్శి సంతోష్ శర్మ, జాయింట్ సెక్రటరి శ్రీహరి శర్మ, శ్యామ్, సురేష్ కృష్ణ శర్మ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు గెల్లు ఉదయ్ యాదవ్ అన్నారు. సోమవారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. నాగేశ్వర్ రెడ్డి, ఆదం విజయ్ కుమార్, వీరన్న, హంసరాజు, సాయిబాబా పాల్గొన్నారు.